# నగుమోముకనలేని ........

తెల్లారీ లేచి అలా వీదిలోగ్గానీ వెళ్ళామంటే రకరకాల మొహాలు మనకి కనిపిస్తుంటాయి. పైకి చెప్పలేం గాని కొత్త మొహాన్ని చూసిన ప్రతిసారి మనలో కొత్త భావాలు పుట్టుకొస్తుంటాయి. కొన్ని మొహాలు నిర్మలంగా ప్రశాంతంగా వుంటాయి. ఇంకొన్ని మొహాల్ని ఒకటికి రెండు సార్లు చూడాలనిపిస్తుంది. కొన్నింటిని ఒకసారి చూసేక జన్మలో మళ్ళీ ఈ ఫేసును చూపించకు స్వామి అంటూ ఇలవేల్పుని వేడుకోవాలనిపిస్తుంది. ఈ విషయాన్ని మన వాళ్ళు కొన్ని మొహాలు చూస్తే పెట్టాలని పిస్తుంది. కొన్ని మొహాలు చూస్తుంటే మొట్టాలని పిస్తుంది అంటుంటారు. వీటినే ముఖారవిందాలంటారు. ఊరుకాని ఊరు వెళ్ళినప్పుడు పరిచయం వున్న మొహం కోసం అల్లాడి పోతాం. వున్న వూళ్ళో మాత్రం కొత్త మొహాల కోసం చూస్తుంటారు.

మొహం చూసే భవిష్యత్తు చెప్పే శాస్త్రం వుంది. అంటే చదవగలిగితే మనిషి మొహం మొత్తం చెప్పేస్తుంది. ఆ శాస్త్రం కొంత మందికే తెలుసుకాబట్టి బతికిపోయాం. మొహం చూసి మనసులో మాట పసిగట్టే విద్యని దేవుడు అందరికీ ఇచ్చుంటే సమాజం కుక్కలు చింపిన విస్తరయి వుండేది. మొగుడూ, పెళ్ళాలు, అన్న దమ్ములు , స్నేహితులు వీధిన పడి మల్లయుద్ధం చేసుకునేవాళ్ళు. ప్రభుత్వాలు పేక మేడల్లాగా కూలిపోయేవి. నిజాన్ని భరించలేని వాళ్ళు సన్యాసం పుచ్చుకుని కాశీనో, రామేశ్వరమో పారిపోయుండె వాళ్ళు . ఊళ్ళు , నగరాలు ఖాళీ అయిపోయి వుండేది. అంచేతనే దేవుడు గొప్పవాడు. మనిషికి మనిషికి మధ్యన ఆత్మవంచన అనే సన్నటి తెర వేశాడు. మనసులోని మాట మరొకడికి తెలియకుండా కనెక్షను తెంపేశాడు. అయినా అదేమిటో గాని కొన్ని మొహాల్లో భావాలు స్పష్టంగా దర్శనమిస్తాయి. ఆనందం కలిగితే కొన్ని మొహాలు వెయ్యివాల్టు బల్బులుగా వెలిగిపోతాయి. అలాగే చిన్న చికాకొచ్చినా కొన్ని కొన్ని మొహాలు వాడిపోయి, నీళ్ళు కారిపోతాయి. సర్వేంద్రియాణం నయనం ప్రదానం అన్నట్టుగానే మొహం గురించి కూడా ఓ ముక్క చెప్పుంటే బాగుండేది. కవులకీ, రచయితలకీ కూడా మొహాలే పెట్టుబడి . భోజరాజు మొహం చూడగానే కవిత్వం ప్రవహించేదట. దాన్ని ఫేస్ కట్ ఎంత పవర్‌ఫుల్లో ఆలోచించండి. సామాజిక స్పృహని జీర్ణించుకున్న ఓ కవిగారు అడుక్కునే వాడిని మొహంలో మొహం పెట్టి చూస్తూ అసువుగా ఆకలిపైన పద్యరత్నాలు చదివేడు. అలాగ ప్రతి మొహం చూసి ఓ కథ

రాస్తానని ఇటీవల ఓ రచయిత ఛాలెంజి చేశారు. అంచేత ఏమిటో ' మొహకారం ' అని మొహం మాడ్చుకోకండి. అంతెందుకు ఆఫీసులకి, షికార్లకి వెళ్ళేటప్పుడు ఆడామగా గంటలతరబడి అద్దం ముందు నిల్చుని మొహానికి పౌడర్లు, స్నోలు రాసి తీర్చి దిద్దుతారు. దేనికీ ? మన మొహం మనకి కనిపించదు గదా ? పక్కవారి కోసం, అందంగా అలకరించిన మన ఫేసుని పది మంది చూసి ఉత్తేజం పొందాలని, మెచ్చుకోవాలని అంటే సామాజిక స్పృహ అంతర్లీనంగా మనందరిలోనూ వుందన్న మాట.

కొన్ని మొహాలకి మీసాలుంటే బావుంటాయి. కొన్నిటికి మీసాలుంటే అసహ్యంగానే కాకుండా రెచ్చగొట్టేట్టుంటాయి. అటువంటి వాడిని పట్టుకుని బుగ్గలు సాగదీసి, ఊరిపొలిమేరల వరకు తరమాలనిపిస్తుంది. మన మొహానికి ఎదుటివాడి భావసంచలననానికి దగ్గర సంబంధం వుందని గుర్తించాలి. కొన్ని కొన్ని మొహాలని చూడగానే మనకి కొన్ని ఉచిత సలహాలివ్వాలనిపిస్తుంది. కాని చెప్పలేం. మీ దగ్గరికి అవసరం కొద్దీ ఒక మొహం వచ్చింది. పనిచేసి పెట్టమని ప్రాధేయ పడుతుంది. ఆ మొహాన్ని చూడగానే మీకు మీసం వుంటే అద్భుతంగా వుంటుందనిపించింది. కాని ఆ విషయం చెప్పగలరా ? మీసం పెంచుకురండి మీ పనినే చేసిపెడతా అనగలరా ? అనలేం. అదే వచ్చిన చిక్కు. కాని ఆడవాళ్ళకి మొహం చూసి ఏ రకం ముస్తాబు రాణిస్తుందో చెప్పేందుకు బ్యూటీ పార్లర్సు వచ్చిపడ్డాయి. మీ ఫేసుకి ఈ రకం హెయిర్ స్టయిల్ సూటవుతుందని, బొట్టు కాస్త పెద్దదిగా పెట్టుకోండని, కనురెప్పలకి రంగు పూయమని డబ్బులు తీసుకుని సలహాలిస్తున్నారు. అంచేతనే బస్సుల్లో, వీధుల్లో మొగ మొహాలకన్నా ఆడ మొహాలు కళాయి పెట్టిన గిన్నెల్లాగా మెరిసి పోతూ కనిపిస్తున్నాయి. ముందు ముందు పురుష పుంగవులక్కూడా ఈ రకం పార్లర్లు వస్తాయేమో తెలీదు. మొన్నీ మధ్యన ఒక రోజు ఉదయాన్నే మా ఇంటికి ఒక మొహం వచ్చింది. తలుపు తీయగానే తిట్టేసి, ఇంటి నెంబరు రాసుకుని వెళ్ళిపోయాడు. ఏమిటీ సంగతంటే ఇలా చెప్పారు. ' మన నమ్మకాలు – మన మొహాలు ' అనే విషయంపై పుస్తకం రాస్తూ, మొహం వాచేట్టు తిట్టి రియాక్షన్స్‌ని ప్రాక్టికల్లా పరీక్షచేస్తున్నాట్ట. అంచేత ఆ వ్యక్తి మీ ఇంటికే రావచ్చు, మొహం దాచి జాగ్రత్తపడండి.

------- అయ్యిపోయింది -------